


## పాత పేపర్లు

నా మాట వినండి. పాత పేపర్లు అమ్మకండి. రేటెక్కువ పలికినా సరే అమ్మద్దమ్మొద్దు. నేనెందుకు చెబుతున్నానో వినండి. పాత పేపర్లు నిధి నిక్షేపాలతో సమానం. గీతా వ్యాక్యాలు కోకొల్లలుగా దొరుకుతాయి. నడుస్తున్న చరిత్రలో ప్రతి పేపరూ ఒక్కో అడుగుగా భావించుకోండి. కక్కుర్తి పడి అమ్మితే రూపాయన్నరో, రెండో వస్తాయి. కాదనను, ఆ చిన్న మొత్తం అరపెట్టె సిగరెట్లకో, కిరసనాయిలకో తగలేస్తారు, అంతేగదా. కానీ, ఈ నెల రికార్డు చరిత్రని రెండు రూపాయలకి ధారపోస్తున్నామని బాధ పడండి

పాత పేపర్లవల్ల ప్రయోజనం ఏమిటని అడగండి చెబుతాను. కొంపరి జాతకాలు మీ దగ్గరుంటాయి. పూర్వం వాళ్ళేం మాట్లాడేరో,

ఏ గీతా వాక్యాలు పలికేరో, ఏ ఏ చర్చల్లో పాల్గొన్నారో మీ... కుంటారు. ప్రస్తుతం సదరు వ్యక్తులు ఏ రంగులు పులుముకుని ఏ వేల్లు ఫిరాయిస్తున్నారో కూడా మీరు గమనించ గలుగుతారు. వీటితో మీ కెంతో కాలక్షేప మవుతుంది. వాళ్ళ వాళ్ళ నిజస్వరూపాలు బోధ పడుతాయి. ఊసర వెల్లుల్ని ఈజీగా పసిగడతారు. వేదాంత తత్వం బోధపడుతుంది. మాయా మేయ జగం అర్థం అవుతుంది. మాయా స్వరూపాన్ని నిర్వచించ గలుగు తారు. నవ్వుకుంటారు. పిడకిలి బిగిస్తారు. ఛీ అనుకుంటారు. సెభాషను కుంటారు. కాలం బొత్తిగా గడవకపోయినా గడుస్తున్న కాలం పరమ బోర్‌గా వున్నా నీరస పడకండి! పాత పేపర్లాట ఆడుకోండి, సరదాగా వుండండి. ఆ ఆట ఇట్లా ఆడుకోవాలి :

పాత పేపర్లు ముందవేసుకోండి. రెండు మూడేళ్ళుగానీ అంతక్రితంవి గానీ అయితే మరీ మంచిది. అక్షరం విడచి పెట్టకుండా మొదట్నుంచీ చివరి వరకూ చదవండి. ఇప్పటి పరిస్థితుల్తో వాటిని బేరీజు వేసుకోండి. ఎన్నో తమాషాలు, వింతలూ విడ్డూరాలు ఎదురవుతాయి. రాజకీయాల్లో ఈ విన్యాసాలు ఎక్కువగా మీకు అగపడతాయి. వాళ్ళ ఉత్పత్తి ప్రమాణాలు, ఆశయాలూ వాళ్ళ విడ్డూర విరోధాలూ కపట స్నేహాలు మిమ్మల్ని ఆశ్చర్య పరుస్తాయి. ఏ గాలి ఎటు వీస్తే అటు మొగ్గే ఈ ప్రముఖులు బొత్తిగా బఫూన్లకు వల్లే మీకు దర్శన మిస్తారు. ఒక్కో వ్యక్తి ఒక్కో బఫూన్ కావడానికి తేడా కాలంలో వుంటుందేగాని గుణంలో కాదని మీకు అర్థమయి పోతుంది. ఒకరు నెలరోజుల్లో బఫూనైతే, మరొకరు ఆర్నెల్లు, ఇంకొకరికి ఏడాది పడుతుంది. నిత్య బఫూన్ల సంగతి సరేసరి. మొత్తానికి అందరూ బఫూన్లనే మీరంగీకరిస్తారు. 1975 నవంబర్లో వెలిగిన వ్యక్తులు యిప్పుడు అడ్రసు లేకుండా పోయినప్పుడు అరరే అనుకుంటారు. ఆ నాటికి అడ్రసు లేని వ్యక్తులు యిప్పుడు దివిటీ వెలిగించి తిప్పుతుంటే ఔరౌరా అని ఆశ్చర్య పోతారు. ఆనాడు మణి కిరీటాలతో, పట్టాభిషేకాల్తో వెలిగిన మహనీయులు ఈనాడు జైళ్ళకి వెళ్ళి పోతున్నారని తెలిసి ఔరా అనుకుటారు. నువ్వేనని ఊదరగొట్టిన వి. ఐ. పి. ఇప్పుడు కాదు పొమ్మంటాడు. నువ్వెవరో నాకు తెలీదంటాడు. నీ అంతు చూసేస్తానంటాడు. ఆనాడు వీర భజనల్తో

అలిసిపోయిన అగ్రగణ్యులు ఈనాడు కొరడాలు పట్టుకుని భరతం పడతామంటారు. ఆ రోజుల్లో నక్సలైట్ల ఉద్యమాన్ని వ్యతిరేకించిన నాయకుడు ఈనాడు నక్సలైట్లను కాల్చిన వాళ్ళకి ఉరి శిక్షలు వేయమంటాడు. ఆ రోజు మద్యపానాన్ని కన్నతల్లిగా కీర్తించిన పుణ్య పురుషుడు, ఈనాడు దాని దుంప తెంచి తగలేయాలని స్టేటుమెంట్లు యిస్తుంటాడు. రాష్ట్ర విభజనే మా హక్కంటూ నినాదాలు యిచ్చి అమాయకులెందర్నో బలిచేసిన పెద్దమనిషి యిప్పుడు ఆ మాటే గుర్తుంచుకోడు. అప్పట్లో మునిపుంగవుడిలా నీతులు చెప్పిన వృద్ధ మహర్షి ఈనాడు పరమ లోఫర్‌గా దర్శనమిస్తాడు. ఇంకా పార్టీల మార్పిడి సంగతికొస్తే కడుపు చెక్కలయ్యేలా నవ్వుకొనే వంతు మీదవుతుంది. ఆ కుప్పిగంతులూ, ఆ లాంగ్ జంపులూ చాలా గమ్మత్తుగా వుంటాయి. ఈ నిలకడలేని మహనీయులు ప్రజా నాయకులుగా యింకా చలామణీ కావడం గొప్ప ఫార్సుగానూ, వింతగానూ వుంటుంది. ప్రజలు పరమ గొర్రెలనే సామెత కొంతవరకైనా కరెక్టని అంగీకరించవలసి వుంటుంది.

నాయకులలో ఈ నిలకడలేని తనమే అనేక ఉద్యమాలను, ఆందోళనలనూ, తలకిందులు చేస్తున్నాయని, అన్నెం, పున్నెం ఎరుగని అమాయకుల ప్రాణాలతో ఆటలాడు కుంటున్నాయని తెలుసుకోగలుగుతాము. చరిత్రలో యిన్ని బీభత్సాలకు నాయకుల ఫీట్సే మూల కారణాలు. ఏ బీభత్సం చదువు, అక్కడ ప్రముఖంగా గోచరించేది ఇదిగో ఈ తైనాతీల తైతక్కలేనని ఊరికే విరుచుకు పడతాడు శివుడు. శివుడు నాకు ఫ్రెండు. పదిహేనేళ్ళ క్రితం పేపరు కావాలన్నా, వాడి దగ్గర దొరుకుతుంది. ఏ రెఫరెన్సు అవసరమయినా క్షణంలో యిస్తాడు. శివుడిలాంటి వ్యక్తులు ఈ దేశంలో ఎంతమందున్నారోగానీ వాళ్ళపుణ్యమాని నేనూ ఆడుకుంటున్నాను. పాతపేపర్లాట. అందుచేత అమ్మకం డమ్మకండి పాత పేపర్లు. అవి గీతా గోవిందాలకు విధి నిక్షేపాలు.